తెలుగు దినపత్రిక

RNI/PRGI : TGTEL/26/A2468

త్రినేత్ర

ట్రూత్‌లైన్

నిజం నిక్కచ్చిగా.. నిరంతరం

రిపోర్టర్లు కావలెను

తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

రెండు తెలుగు రాష్ట్రాల్లో -
త్రినేత్ర ట్రూత్‌లైన్ తెలుగు దిన పత్రికలో

జిల్లా బ్యూరో, జిల్లా స్టాఫ్- డివిజన్ అసెంబ్లీ ఇంఛార్జీలు
మండల రిపోర్టర్ కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.
సంప్రదించవలసిన ఫోన్ నంబరు

94419 29000

సంపుటి : 01 సంచిక : 207 ఎడిటర్ : పెరిక అభిలాష్ మంగళవారం 17-11-2026 పేజీలు : 4 వెల: రూ.2

www.youtube.com/@Thrinethra Truthlinenews | thrinethratruthline_news | Thrinethra Truthline News | www.epaperthrinethratruthline.co.in/

సర్ పై సుప్రీంకోర్టుకు రాహుల్ గాంధీ..

ఎన్నికల సంఘానికి 48 ప్రశ్నలతో పిటిషన్



ఢిల్లీ : (త్రినేత్ర ట్రూత్‌లైన్)

దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రధాన ఎన్నికల కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, అలాగే భారీ ఎత్తున ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని ఆరోపిస్తూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నేతలు సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై భారత ఎన్నికల సంఘానికి 48 అధికారిక లిఖితపూర్వక ప్రశ్నలు పంపేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ వారు పిటిషన్ దాఖలు చేశారు. అందుకు సంబంధించి ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పాటు ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి అఫిడవిట్లు దాఖలు చేయాలని డిమాండ్ చేశారు.

అసలు వివాదం ఇదే..

మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ప్రవేయం, ఆమోదం లేకుండానే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల కమిషన్ యొక్క ఉమ్మడి అధికారాలను వినియోగించారా

(మిగతా 2లో..)

భారత్ సమ్మిట్‌పై ముదురుతున్న

రాజకీయ దుమారం..

ఫిలిబెక్ వ్యాఖ్యలపై టీ బీజేపీ ఫిర్యాదు



(త్రినేత్ర ట్రూత్‌లైన్) హైదరాబాద్ :

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో విదేశీ ప్రతినిధుల ప్రసంగాలు రాజకీయ దుమారానికి దారితీస్తున్నాయి. ముఖ్యంగా ఇటలీకి చెందిన నేత జియ కోమో ఫిలిబెక్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షు డు రామచందర్ రావు సోమవా రం శంషాబాద్ ఇమ్మిగ్రేషన్ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు.

(మిగతా 2లో..)

గవర్నర్ ఎక్సలెన్స్ అవార్డ్స్ - 2026కు దరఖాస్తుల ఆహ్వానం..



(త్రినేత్ర ట్రూత్‌లైన్) హైదరాబాద్ :

వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న వ్యక్తులు, సంస్థలను ప్రోత్సహించేందుకు అందించే ప్రతిష్టాత్మక 'గవర్నర్ ఎక్సలెన్స్ అవార్డ్స్ - 2026' దరఖాస్తుల స్వీకరణకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. సోమవారం లోక్‌భవన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిషోర్ అధికారికంగా ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు.

(మిగతా 2లో..)

హరీష్ రావు చేసిన అవినీతిపై నిగ్గు తేల్చాల్సిందే: కవిత

(త్రినేత్ర ట్రూత్‌లైన్) హైదరాబాద్ :

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు అవినీతిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు బయటపెట్టాల్సిందేనని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్రజాక్షేత్రంలో పోరాటం కొనసాగిస్తానే చట్టపరంగా, న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని మార్గాల్లోనూ పోరాడతామని స్పష్టం చేశారు. హరీశ్ రావు అవినీతికి సంబంధించిన ఆధారాలను సీబీసీఐడీ, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు సైతం వంపిస్తామని వెల్లడించారు. తప్పు చేసిన వారెవరైనా శిక్ష పడాల్సిందేనని



అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న ఆమె మీడియాతో మాట్లాడారు.

మోడీని కలిసి కరువు గురించి మాట్లాడరా?

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొంటున్నవ్పటి కీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కవిత విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీని కలిసిన ముఖ్యమంత్రి రాష్ట్రంలోని కరువు పరిస్థితులు, రైతుల సమస్యలను ప్రస్తావించ కపోవడం అన్యాయమన్నారు. రైతుల ఇబ్బందులను ప్రధాని దృష్టికి తీసుకెళ్లి కేంద్ర సాయం కోరాల్సిన బాధ్యత ముఖ్య మంత్రిపై ఉందని పేర్కొన్నారు. కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లు అంశాన్ని కూడా ప్రధాని వద్ద ప్రస్తావించలేదని ఆరోపించారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను పక్కనపెట్టి కేవలం కాంట్రా క్టులు, కమీషన్ల గురించే

(మిగతా 2లో..)

ఉత్తమ్ వ్యాఖ్యలపై కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు..

"ఇదే బెస్ట్ జోక్" అంటూ సెటైర్



(త్రినేత్ర ట్రూత్‌లైన్) హైదరాబాద్ :

నగరంలో తాగునీటి కొరత లేదని, వచ్చే వర్షాకాలం వరకు రిజర్వాయర్లలో సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మంత్రి వ్యాఖ్యలపై ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆయన తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు.ఈ మధ్యకాలంలో తాను విన్న అత్యుత్తమ జోక్ ఇదేనని కేటీఆర్ ఎద్దేవా చేశారు. "కాంగ్రెస్ జోకర్లను ఎన్నుకుంటే ఇలాంటి సర్కస్ నే ఆశించాలి మరి" అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేస్తున్న ప్రకటనలు పూర్తిగా వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని కేటీఆర్ తన ట్వీట్‌లో విమర్శించారు.

తెలంగాణకు అక్వాన్ తుపాను ముప్పు..



(త్రినేత్ర ట్రూత్‌లైన్) హైదరాబాద్ :

నవంబర్ 20 నుంచి 22 వరకు భారీ వర్షాల హెచ్చరిక..
బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర

(మిగతా 2లో..)

పేద, మధ్యతరగతి ప్రజలకు శుభవార్త..

7 లక్షల మందికి పట్టా సర్టిఫికెట్ల వాపస్



(త్రినేత్ర ట్రూత్‌లైన్) హైదరాబాద్ :

రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉమ్మడి రాష్ట్రంలో 2014కు ముందు వివిధ గృహ నిర్మాణ పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ గృహకల్ప, వాంబే కింద ఇళు పొందిన లబ్ధిదారుల దశాబ్దాల నాటి నిరీక్షణకు ప్రభుత్వం ఎట్టకేలకు తెరదించింది. రుణాల మంజూరు సమయంలో గృహనిర్మాణ సంస్థ వద్ద తనఖాలో ఉన్న పట్టా, పొజిషన్ సర్టిఫికెట్లను లబ్ధిదారులకు తిరిగి వాపస్ ఇచ్చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది.

7 లక్షల కుటుంబాలకు ప్రయోజనం..

అయితే, ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 లక్షల మంది లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనం చేకూరనుంది. గతంలో ప్రభుత్వ ఇళ్ల వధకాల కింద ఇళ్లు మంజూరైనప్పుడు, బ్యాంకులు, హౌసింగ్ కార్పొరేషన్ రుణాల నిమిత్తం లబ్ధిదారుల ఒరిజినల్ పట్టా, పొజిషన్ పత్రాలను అధికారులు తమ వద్దే పెట్టుకున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఆ పత్రాలు చేతికి అందకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒరిజినల్ పట్టా, పొజిషన్ సర్టిఫికెట్లు చేతికి రావడం వల్ల ఆ ఇళ్లపై లబ్ధిదారులకు పూర్తి స్థాయి చట్టబద్ధమైన యాజమాన్య హక్కులు లభిస్తాయి.అయితే, ఇన్నాళ్లు ఒరిజినల్ పత్రాలు లేకపోవడం

(మిగతా 2లో..)

ఏఐ దుర్వినియోగం, డీప్‌ఫేక్‌లపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మెగాస్టార్ చిరంజీవి వినతిపత్రం



(మిగతా 2లో..)

పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పెరుగుతున్న మహిళల సంఖ్య: తెలంగాణ డీజీపీ కీలక వ్యాఖ్యలు



(మిగతా 2లో..)

పేద, మధ్యతరగతి ప్రజలకు శుభవార్త..

(మొదటిపేజీ తరువాయి)

వల్ల ఇప్పటి వరకు ఆ ఇళ్లను అమ్ముకోవడానికి గానీ, పిల్లల వివాహాలు, ఉన్నత చదువులు, అత్యవసర వైద్య ఖర్చుల కోసం బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడానికి గానీ వీలుండేది కాదు. తాజా నిర్ణయంతో ఆ అడ్డంకులన్నీ తొలగిపోనున్నాయి. తల్లిదండ్రుల తదనంతరం వారసుల పేరిట ఆస్తులను బదలాయించుకోవడం కూడా ఇకపై సులభతరం కానుంది. గృహనిర్మాణ శాఖ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకంగా ఈ సర్టిఫికెట్లను అందజేయాలని ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న లక్షలాది పేద కుటుంబాలకు ఈ నిర్ణయం బిగ్ రిలీఫ్‌ను ఇచ్చింది.

గవర్నర్ ఎక్సలెన్స్ అవార్డ్స్ - 2026కు దరఖాస్తుల ఆహ్వానం..

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా దానకిషోర్ మాట్లాడుతూ.. సమాజ హితం కోసం పాటుపడుతున్న వారిని గుర్తించి సత్కరించే ఉద్దేశంతో గత రెండేళ్లుగా గవర్నర్ ఎక్సలెన్స్ అవార్డులను అందజేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది మొత్తం నాలుగు ప్రధాన విభాగాల్లో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లుగా ఆయన వెల్లడించారు.

అవార్డులు ఇచ్చే విభాగాలు ఇవే..

1. మాదకద్రవ్యాల నిర్మూలన: సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారి నిర్మూలనకు విశేషంగా కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలకు. 2. ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం: ట్రాన్స్‌జెండర్ల అభ్యున్నతి, వారికి విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పాటుపడుతున్న వారికి. 3.పర్యావరణ, జల సంరక్షణ: భూగర్భ జలాల పెంపుదల, చెరువుల పరిరక్షణ మరియు విరివిగా మొక్కల పెంపకంలో విశేష కృషి చేసిన వారికి. 4. స్టార్టప్‌లు, ఆవిష్కరణలు: వినూత్న ఆలోచనలు, సరికొత్త ఆవిష్కరణలతో పాటు ఉత్తమ పనితీరు కనబరుస్తున్న స్టార్టప్ సంస్థలకు. అదేవిధంగా ఆయా రంగాల్లో విశేష సేవలందించిన వ్యక్తులు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఈ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు నవంబర్ 16 నుంచి డిసెంబర్ 10 వరకు ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ విధానాల్లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. స్వీకరించిన దరఖాస్తులను నిపుణుల కమిటీ పరిశీలించిన అనంతరం.. 2027 జనవరి మొదటి వారంలో 'గవర్నర్ ఎక్సలెన్స్ అవార్డ్స్ – 2026' విజేతలను ప్రకటిస్తామని దానకిషోర్ పేర్కొన్నారు. సమాజ మార్పు కోసం కృషి చేస్తున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

సర్ పై సుప్రీంకోర్టుకు రాహుల్ గాంధీ..

(మొదటిపేజీ తరువాయి)

అనే అంశాన్ని పిటిషనర్లు ప్రశ్నించారు. కీలకమైన అధికారిక ఫైళ్లు, సమావేశపు మినిట్స్, రికార్డులను దాచిపెడుతూ, ఎన్నికల సంఘం కేవలం నిరాధారమైన వాదనలతో కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేసిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సర్ నిర్వహించేందుకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆగస్టు 2025లో వచ్చిన సమాచార హక్కు చట్టం సమాధానాన్ని ఇందులో ప్రస్తావించారు. సుప్రీంకోర్టు నిబంధనలు 2013లోని ఆర్డర్ ఎ రూల్ 1, ఆర్డర్ XXXVIII రూల్ 11(9), ఆర్డర్ ూఎ రూల్ 6 ప్రకారం, జస్టిస్ కేఎస్ పుట్టస్వామి ఎం యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఉటంకిస్తూ ఈ అనుమతి కోరారు.

48 అధికారిక లిఖితపూర్వక ప్రశ్నలు..

అయితే, ఫిబ్రవరి 2025 నుంచి అక్టోబర్ 2026 మధ్య కాలంలో సర్ , ECINET, ఫారం 6, కోర్టు అప్పీళ్లపై ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి ఏవైనా లిఖితపూర్వక అభ్యంతరాలు, భిన్నాభిప్రాయాలు నమోదు చేశారా అనే వివరాలను వెల్లడించాలని పిటిషనర్లు కోర్టును కోరారు. ఓటర్ల జాబితా డేటాబేస్‌లోకి ప్రైవేట్ కాంట్రాక్టర్లు, వెండర్లకు మార్పులు చేసే అవకాశం ఉందా, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ల ఉత్తర్వులు లేకుండానే భారీగా ఓట్ల తొలగింపు జరిగిందా, యాక్సెస్ ఆడిట్ ప్రతిపాదనలపై తీసుకున్న చర్యలేమిటో సర్ డైరెక్టర్ జనరల్ స్పష్టం చేయాలని కోరారు. అదేవిధంగా ఆన్‌లైన్ ఫారం-6లో కొత్త డిక్లరేషన్ చేర్చడానికి ఎవరు అనుమతించారు, డ్రాఫ్ట్, తుది జాబితాల నుంచి తొలగించబడిన ఓటర్ల రాష్ట్రాల వారీ డేటా, అలాగే అత్యవసర ECI ఆమోదాలను వాట్సాప్, వ్యక్తిగత ఈ-మెయిల్ ద్వారా పొందారా అనే వివరాలను పిటిషనర్లు ధర్మాసనాన్ని అడిగారు.

తెలంగాణకు అక్వాన్ తుపాను ముప్పు..

(మొదటిపేజీ తరువాయి)

వాయుగుండం 'అక్వాన్ తుపాను'గా బలపడుతున్న నేపథ్యంలో తెలంగాణకు వాతావరణ నిపుణులు కీలక హెచ్చరికలు జారీ చేశారు. నవంబర్ 20న ఆంధ్రప్రదేశ్ తీరాన్ని (నెల్లూరు – తుని మధ్య, ప్రధానంగా కావలి – కోనసీమ మధ్య ఒంగోలు/బాపట్ల సమీపంలో) ఈ తుపాను తీరం దాటే అవకాశం ఉన్నందున, నవంబర్ 20 నుంచి 22 వరకు తెలంగాణపై దీని ప్రభావం తీవ్రంగా ఉండనున్నట్లు వెదర్ మ్యాన్ అంచనా వేశారు. కాగా ఈ తుపాను ప్రభావంతో తూర్పు తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.ముఖ్యంగా నవంబర్ 21న దీని తీవ్రత గరిష్టంగా ఉండనుండగా, కొన్ని ప్రాంతాల్లో 150 మి.మీ నుంచి 200 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ జిల్లాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో నవంబర్ 21, 22 తేదీల్లో ఆకాశం మేఘావృతమై ఉండి, తేలికపాటి జల్లుల నుంచి మోస్తరు వర్షాలు (ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం) కురిసే అవకాశం ఉంది.అలాగే పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో తుపాను ప్రభావం తక్కువగా ఉంటుందని, అక్కడ కేవలం తేలికపాటి వర్షాలు లేదా పొడి వాతావరణం కొనసాగే అవకాశం ఉందని వాతావరణ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తుపాను గమనంలో ఏవైనా మార్పులు ఉంటే నవంబర్ 19 లేదా 20వ తేదీల్లో తాజా మ్యాప్ అంచనాలను విడుదల చేస్తామని, లేనిపక్షంలో ఇదే అంచనా కొనసాగుతుందని వాతావరణ నిపుణులు వెదర్ మ్యాన్ స్పష్టం చేశారు.

ఏఐ దుర్వినియోగం, డీప్‌ఫేక్‌లపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మెగాస్టార్ చిరంజీవి వినతిపత్రం

(త్రినేత్ర ట్రూత్‌లైన్) హైదరాబాద్ :



కృత్రిమ మేధ దుర్వినియోగం, డీప్‌ఫేక్ వీడియోలు, డిజిటల్ ఇంపర్సనేషన్ వంటి సమస్యల నుంచి కళాకారులకు, సామాన్య పౌరులకు రక్షణ కల్పించాలని మెగాస్టార్ చిరంజీవి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిని కలిసి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ విషయాన్ని చిరంజీవి స్వయంగా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. అందులో ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జరిగిన తన సమావేశం, ఆయన సూచనల మేరకు.. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, కేంద్ర సమాచార ం ప్రసార మంత్రిత్వ శాఖలకు ఉద్దేశించిన వినతిపత్రాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి అందజేసినట్లు చిరంజీవి తెలిపారు. ఈ అంశాలను సంబంధిత మంత్రిత్వ శాఖల దృష్టికి తీసుకెళ్లి, సమన్వయం చేస్తానని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హామీ ఇచ్చినందుకు చిరంజీవి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి పౌరుడి భద్రతతో పాటు కళాకారుల గౌరవం, గుర్తింపు, సృజనాత్మక హక్కులను కాపాడటం అందరి ఉమ్మడి బాధ్యత అని చిరంజీవి పేర్కొన్నారు. "సాంకేతికత సృజనాత్మకతను పెంపొందించాలే తప్ప, ఆత్మగౌరవాన్ని నాశనం చేయకూడదు" అని అభిప్రాయపడుతూ #UniteAgainstDigitalAbuse అనే హ్యాష్‌ట్యాగ్‌ను ఆయన జతచేశారు.

హరీష్ రావు చేసిన అవినీతిపై నిగ్గు తేల్చాల్సిందే: కవిత

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంట్రాక్టులు, కమీషన్లు తప్ప ముఖ్యమంత్రికి ప్రజల బాధలు పట్టవా? అని ప్రశ్నించారు.

ప్రతి ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలి:

రాష్ట్రంలో కరువు మండలాలను ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కానీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కానీ రైతులను పంటలు వేయవద్దని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డేనని విమర్శించారు. పంటలు సాగు చేయవద్దని సూచించిన రైతులకు ప్రభుత్వం ఎలాంటి పరిహారం అందిస్తుందో స్పష్టం చేయాలని కోరారు. కరువు మండలాల్లో ప్రతి రైతుకు ఎకరాకు రూ. 25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

త్వరలో భైరవ వాహనంలో రాష్ట్రవ్యాప్త యాత్ర

ప్రజలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించడంతో పాటు అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కల్పించడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని కవిత తెలిపారు. పాంచజన్య సంకల్పంలో భాగంగా త్వరలోనే భైరవ వాహనంలో రాష్ట్రవ్యాప్తంగా యాత్ర చేపడతామని వెల్లడించారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు తమ పార్టీ కృషి చేస్తోందన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని, కనీసం జాబ్ క్యాలెండర్ కూడా ప్రకటించలేదని విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటర్లు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా కాలం వెళ్లదీస్తున్నాయని ఆరోపించారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటర్ బోర్డు రద్దుపై అభ్యంతరం

ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై కవిత అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రజలు, విద్యావేత్తలు, సంబంధిత వర్గాల అభిప్రాయాలను చర్చించేందుకు మంగళవారం తమ పార్టీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

భారత్ సమ్మిట్‌పై ముదురుతున్న రాజకీయ దుమారం..

(మొదటిపేజీ తరువాయి)

జియకోమో ఫిలిబెక్ ప్రస్తుతం భారత్‌లో ఉంటే వెంటనే దేశం నుంచి డీపోర్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆయన ఇప్పటికే దేశం విడిచి వెళ్లి ఉంటే తిరిగి భారత్‌లో అడుగుపెట్టకుండా నిషేధం విధించాలని కోరారు.

వేరే దేశంలో అయితే కాల్చిపారేసేవారు..

ఫిలిబెక్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన రామచందర్ రావు.. కొన్ని దేశాల్లో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే కాల్చి పారేసేవారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఓ వైపు రాహుల్ గాంధీ, మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫిలిబెక్ వ్యాఖ్యలకు చప్పట్లు కొట్టారని ఆరోపించారు. ఇంతకంటే దేశద్రోహం ఏముంటుందని ప్రశ్నించారు. భారత్ సమ్మిట్ నిర్వహించిన వారిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై త్వరలోనే డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. భారత్ సమ్మిట్ వేదికగా దేశ వ్యతిరేక నినాదాలు వినిపించారని ఆందోళన వ్యక్తం చేశారు.

జియకోమో ఫిలిబెక్ ఏమన్నారు?

భారత్ సమ్మిట్‌లో ప్రసంగించిన ఇటలీ నేత జియకోమో ఫిలిబెక్.. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా ఉన్న ఓటు చోరీ అంశాన్ని ప్రస్తావించారు. 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్' అంటూ నినాదాలు చేశారు. భారతదేశ అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో ఓ విదేశీ నేత జోక్యం చేసుకోవడంపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మన దేశ రాజకీయ అంశాలపై విదేశీ ప్రతినిధులు వ్యాఖ్యలు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కాగా మరోవైపు ఫిలిబెక్ వ్యాఖ్యలపై ఇటలీ అధికార పార్టీ ఫోర్జా ఇటాలియా పార్లమెంట్ సభ్యురాలు, జాతీయ డిప్యూటీ సెక్రటరీ డెబోరా బెర్గామిని స్పందించారు. భారతదేశ అంతర్గత రాజకీయ వివాదాల్లో యూరోపియన్ నేతలు జోక్యం చేసుకోవడం ఏమాత్రం సమంజసం కాదని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌కు కొత్త చిక్కులు

భారత్ సమ్మిట్ విషయంలో మొదటి నుంచి బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. ఈ సమావేశాన్ని దేశద్రోహుల సమూహంగా బీజేపీ అభివర్ణిస్తూ విమర్శలు గుప్పిస్తోంది. ఇలాంటి సమయంలో జియకోమో ఫిలిబెక్ భారత అంతర్గత రాజకీయ అంశంపై వ్యాఖ్యలు చేయడం, వాటికి రాహుల్ గాంధీ చప్పట్లు కొట్టారంటూ బీజేపీ ఆరోపణలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పెరుగుతున్న మహిళల సంఖ్య: తెలంగాణ డీజీపీ కీలక వ్యాఖ్యలు

(త్రినేత్ర ట్రూత్‌లైన్) హైదరాబాద్ :

పోలీస్ బ్యాండ్ అనేది బలగాల క్రమశిక్షణ, ఐక్యత, ఆత్మగౌరవానికి ప్రతీక అని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ బ్యాండ్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ పోటీల్లో వివిధ విభాగాలకు చెందిన 21 పోలీస్ బ్యాండ్ బృందాలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పోలీస్ బ్యాండ్ పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. దేశంలో పోలీస్, మార్షల్ బ్యాండ్ సంప్రదాయానికి శతాబ్దాల ఘన చరిత్ర ఉందని గుర్తు చేశారు. అనంతరం పోలీస్ శాఖలో మహిళల ప్రాతినిధ్యంపై డీజీపీ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో మహిళల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, ఇది ఎంతో శుభపరిణామమని కొనియాడారు. అలాగే, సీఆర్పీఎఫ్, రాష్ట్ర పోలీస్ శాఖల మధ్య ఎన్నో ఏళ్లుగా మంచి అనుబంధం కొనసాగుతోందని తెలిపారు. దేశ భద్రత, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో వివిధ భద్రతా దళాల మధ్య సమన్వయం, పరస్పర సహకారం ఎంతో కీలకమని డీజీపీ స్పష్టం చేశారు.

తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ల చేతుల మీదుగా చలో ఢిల్లీ మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ

(త్రినేత్ర ట్రూత్‌లైన్)

హైదరాబాద్ :



సమాచార హక్కు చట్టం ఆర్ టీ ఐ యాక్ట్ 2005 సమర్థవంతమైన అమలు, ప్రభుత్వ శాఖల్లో పార దర్శకత, అధికారుల జవాబుదారీ తనం, అవినీతి నిర్మూలన లక్ష్యంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో ఢిల్లీ జాతీయ మహా ధర్నా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఈరోజు హైదరాబాద్‌లో ఆవిష్కరించడం జరిగింది. ఈ పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు దేశాల భూపాల్, మొహసినా పర్వీన్ తమ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం సామాన్య పౌరుడికి ప్రభుత్వ పాలనలో పారదర్శకతను కోరే శక్తివంతమైన సాధనమని, ఈ చట్టం సమర్థవంతంగా అమలైనప్పుడే ప్రజలకు సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఆర్ టీ ఐ చట్టం అమలులో ఎదురవుతున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, సమాచార హక్కు చట్టాన్ని మరింతసమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేయడం ఈ మహా ధర్నా ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సూర ప్రవంతి, జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, జాతీయ ఉపాధ్యక్షులు గోపీనాథన్ కట్టెకోల, రాష్ట్ర మహిళా కార్యదర్శి లక్ష్మి అన్నపూర్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు సాయం మహేష్ కుమార్, నాగరాజ రావు, హరికృష్ణ, శిరీష, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాన రావు, కంటోన్మెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు మల్లికార్జున్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు తోట సురేష్, ములుగు జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్ రెడ్డి,శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ తిరుమల గ్రూప్ ఆధ్వర్యంలో నవంబర్ 29న కార్తీక వన సమారాధన

(త్రినేత్ర ట్రూత్‌లైన్) హైదరాబాద్:



ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ తిరుమల గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహిస్తున్న కార్తీక వన సమారాధన కార్యక్రమం ను జయప్రదం చేయాలనీ ప్రాజెక్టు చైర్మన్ కొటికె విఠల్,కో చైర్మన్ మడుపల్లి రవి గుప్తా, ఆర్యవైశ్య మహాసభ తిరుమల గ్రూప్ అధ్యక్షులు సింగిరికొండ నరసింహ, నీలా ఉదయ్ చంద్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జీవిత సభ్యులు పాల్గొనవచ్చు అని, పాల్గొనేవారు సభ్యులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని రిజిస్ట్రేషన్ కమిటీ చైర్మన్ కొటికే విఠల్ విజ్ఞప్తి చేశారు. ఇంకా జీవిత సభ్యత్వం తీసుకోని వారు సభ్యత్వం పొంది, కార్యక్రమానికి తమ పేరును నమోదు చేసుకొని పాల్గొనవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు, తంగుటూరి రామకృష్ణ,గౌరవ అధ్యక్షులు టీజీ వెంకటేష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లు హాజరవుతారని తెలిపారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి - జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ, నవంబర్ 16 (త్రినేత్ర ట్రూత్‌లైన్ ప్రతినిధి): నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 28 మంది బాధితులు భూ వివాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు, ఆర్థిక లావాదేవీలు, సివిల్ వివాదాలు, కేసుల దర్యాప్తు పురోగతిపై ఫిర్యాదులు అందజేశారు. బాధితుల సమస్యలను స్వయంగా విన్న ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి కేసుల వివరాలు తెలుసుకున్నారు. చట్టప్రకారం పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. బాధితులకు ఎప్పటికప్పుడు కేసుల పురోగతిని తెలియజేయాలని సూచించారు. ప్రజలకు సత్వర, పారదర్శక సేవలు అందించడమే పోలీస్ శాఖ లక్ష్యమని, ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా విచారించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు



రూ.7,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

సంక్షేమ హాస్టళ్ల కాస్మోటిక్, మెస్ బకాయిలు చెల్లించాలి – కట్టెల శివ కుమార్

నల్లగొండ (త్రినేత్ర ట్రూత్‌లైన్ ప్రతినిధి): పెండింగ్‌లో ఉన్న రూ.7,500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం తెలంగాణ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లకు సంబంధించిన కాస్మోటిక్, మెస్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కట్టెల శివ కుమార్ మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల కాకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బండారు శంకర్, రాష్ట్ర గౌరవ సలహాదారు కందుల విజయకుమార్, పెన్షనర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు, గౌరవ సలహాదారు జానీమియా, స్టేట్ కమిటీ సభ్యుడు సాల్మన్ రాజ్, ఉపాధ్యక్షులు సురేందర్ నాయక్, ప్రశాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నేరగాళ్లకు హెచ్చరిక.. బాధ్యతలు స్వీకరించిన నూతన వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ క్రాంతికుమార్!

రౌడీషీటర్లు, గంజాయి ముఠాలు, అసాంఘిక శక్తులకు ఇకపై పోలీసుల నిఘా.. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు!



నల్లగొండ, నవంబర్ 16, త్రినేత్ర ట్రూత్‌లైన్, ప్రతినిధి:నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్స్పెక్టర్‌గా సంధ్య పోగుల క్రాంతికుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలకు పాల్పడే వారికి, రౌడీషీటర్లకు, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల విక్రయదారులకు ఆయన గట్టి హెచ్చరిక జారీ చేశారు.పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాలు, మత్తు పదార్థాల సరఫరా, అక్రమ దందాలు, దొంగతనాలు, దాడులు, బెదిరింపులు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచడంతో పాటు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, డీఎస్పీ శివరామిరెడ్డి మార్గదర్శకత్వంలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసులను సంప్రదించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమని ఇన్స్పెక్టర్ క్రాంతికుమార్ తెలిపారు.

ఇంటిపై మూకుమ్మడి దాడి.. కులం పేరుతో దూషణలు!

కుమారుడి తలకు మూడు కుట్లు.. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు



నల్గొండ, నవంబర్ 16, త్రినేత్ర ట్రూత్‌లైన్, ప్రతినిధి:మిర్యాలగూడ గాంధీనగర్‌లో తమ ఇంటిపై మూకుమ్మడి దాడి చేసి, కులం పేరుతో దూషించారని ఆరోపిస్తూ బాధితుడు దైద సత్యం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీపావళి రాత్రి బాణసంచా పేలుళ్లను ఆపాలని కోరినందుకు సరాబు జగదీష్, అతని అనుచరులు కర్రలతో దాడి చేశారని పేర్కొన్నారు.ఈ దాడిలో తన కుమారుడి తల పగిలి మూడు కుట్లు పడ్డాయని, చేతికి కూడా గాయమైందని సత్యం తెలిపారు. తనకు, దాడిని అడ్డుకున్న మరో ఇద్దరికి గాయాలయ్యాయని వివరించారు. పోలీస్ స్టేషన్‌లోనూ తమను బెదిరించారని, రాజకీయ ఒత్తిళ్లతో నిందితులపై బలహీనమైన సెక్షన్లు నమోదు చేశారని ఆరోపించారు.నిందితులపై ఘటన తీవ్రతకు తగిన చట్టపరమైన చర్యలు తీసుకొని, తమ కుటుంబానికి ప్రాణరక్షణ కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ ఘటనపై దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసనలు, రాస్తారోకోలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసుకుల మట్టయ్య, బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు, మొండి కత్తి లింగయ్య, టీఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు, సయ్యద్ ఫారూక్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వాచ్‌మెన్ మృతి!

చికిత్స పొందుతూ గాంధీ ఆసుపత్రిలో కన్నుమూత.. వాహనం కోసం పోలీసుల గాలింపు



నాగోల్, నవంబర్ 16, త్రినేత్ర ట్రూత్‌లైన్, ప్రతినిధి:గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వాచ్‌మెన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం.. జీ.వి.ఆర్ కాలనీకి చెందిన గట్టిగుండ్ల సైదులు (60) వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. నవంబర్ 16 అర్ధరాత్రి 12.45 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై బండ్లగూడ బస్ డిపో రోడ్డు మీదుగా వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన కుడి కంటికి తీవ్ర గాయం కాగా, ఎడమ కాలు విరిగింది.కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అదే రోజు ఉదయం 11.56 గంటలకు మృతి చెందారు. మృతుడి కుమారుడు గట్టిగుండ్ల లెవిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో అన్నదానం

డాక్టర్ రమేష్ చంద్ర జన్మదినం సందర్భంగా వృద్ధులకు అల్పాహార వితరణ

మానవ సేవే మాధవ సేవ నినాదంతో నిరంతర సేవా కార్యక్రమాలు: కృష్ణ గోపాల్ సేవా సమితి

(త్రినేత్ర ట్రూత్‌లైన్)

వనస్థలిపురం:





'మానవ సేవే మాధవ సేవ' అనే ఉన్నత ఆశయంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వృద్ధాశ్రమంలో ఉదయం అల్పాహార పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. డాక్టర్ రమేష్ చంద్ర జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమితి సభ్యులందరూ కలిసి వృద్ధులకు కడుపు నిండా రుచికరమైన అల్పాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి సభ్యులు వృద్ధాశ్రమంలోని పెద్దవారిని ఆప్యాయంగా పలకరించి, స్వయంగా వారి చేతులకు అల్పాహారం అందించి తమ సేవా నిరతిని చాటుకున్నారు. మన చిన్న సహాయం మరొకరి జీవితంలో పెద్ద సంతోషాన్ని నింపుతుందని సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. జన్మదినాలు, వివాహ వార్షికోత్సవాలు వంటి సంతోషకరమైన వేడుకలను లేదా పెద్దల జ్ఞాపకార్థం నిర్వహించే కార్యక్రమాలను ఆర్భాటాలకు కాకుండా ఇలా నిరుపేదలు, వృద్ధుల ఆకలి తీర్చే సేవా కార్యక్రమాల రూపంలో జరుపుకోవడం ఎంతో సంతృప్తినిస్తుందని వారు తెలిపారు.

సేవా కార్యక్రమాల కోసం సంప్రదించండి:

ప్రజల జీవితంలో జరిగే సంతోషకరమైన సందర్భాలైనా, బాధాకరమైన సందర్భాలైనా వాటిని సేవా కార్యక్రమాల రూపంలో పంచుకోవాలనుకునే దాతలు తమను సంప్రదించవచ్చని కృష్ణ గోపాల్ సేవా సమితి పిలుపునిచ్చింది. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి తమ బృందం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేసింది. సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలనుకునే వారు 8106876999 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి బృంద సభ్యులు, వృద్ధాశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పిగ్లీపూర్ ప్రభుత్వ భూములను కాపాడాలి

: కలెక్టర్, ఆర్డీవోలకు సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి వినతి

సర్వే నం. 17లోని 386 ఎకరాలపై సమగ్ర సర్వే జరిపి హద్దులు నిర్ణయించాలి

భూబకాసురుల నుండి ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని 'ప్రజావాణి'లో ఫిర్యాదు





(త్రినేత్ర ట్రూత్‌లైన్) అబ్దుల్లాపూర్‌మెట్:

పిగ్లీపూర్ గ్రామ పరిధిలోని విలువైన ప్రభుత్వ భూములను భూబకాసురుల ఆక్రమణల నుండి కాపాడాలని కోరుతూ గ్రామ సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఇబ్రహీంపట్నం ఆర్డీవోని కూడా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన కలెక్టర్ వినతిపత్రంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఆర్డీవోను ఆదేశించారు.

పిగ్లీపూర్ ప్రభుత్వ భూములను కాపాడాలి: సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి

ఈ సందర్భంగా సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, గ్రామ రెవెన్యూ రికార్డుల ప్రకారం పిగ్లీపూర్ సర్వే నంబర్ 17లో మొత్తం 386 ఎకరాల 15 గుంటల భూమి ఉందని తెలిపారు. అనంతర రికార్డుల ప్రకారం ఇందులో సర్వే నం. 17/1/2/0లో 75 ఎకరాలు భూదాన్ యజ్ఞ బోర్డు భూమి, సర్వే నం. 17/2లో 61 ఎకరాలు ఖరీజ్ ఖాతా ప్రభుత్వ భూమి, సర్వే నం. 17/3 నుండి 17/18 వరకు 53 ఎకరాలు సీలింగ్ ప్రభుత్వసీలింగ్ పట్టా భూములు, మిగిలిన 197 ఎకరాల 15 గుంటలు పట్టా భూమిగా నమోదై ఉన్నాయని వివరించారు.

సమగ్ర సర్వే చేసి ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు చేయాలి – సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి:

సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. "సర్వే నంబర్ 17లోని భూముల వర్గీకరణ, సరిహద్దుల నిర్ధారణ విషయంలో గ్రామ ప్రజల్లో అనేక సందేహాలు, అభ్యంతరాలు నెలకొన్నాయి. గతంలో అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ నిర్వహించిన సర్వేలోనూ ఇవి ప్రభుత్వ, సీలింగ్, భూదాన్ భూములుగా గుర్తించబడ్డాయి. వెంటనే ఈ భూమిపై సమగ్ర సర్వే నిర్వహించి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించాలి. 'ఈ భూమి ప్రభుత్వ భూమి – ఆక్రమణ నిషేధం' అని స్పష్టంగా పేర్కొంటూ ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు చేయాలి. ఇప్పటికే ఎక్కడైనా ఆక్రమణలు జరిగి ఉంటే వాటిని తక్షణమే తొలగించి, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.

పర్యాటక కేంద్రంగా లేదా ప్రభుత్వ క్వార్టర్లకు వినియోగించాలి – సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి:

అలాగే, గుర్తించిన ఈ ప్రభుత్వ భూమిని గ్రామాభివృద్ధి దృష్ట్యా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, లేదా సంబంధిత ప్రభుత్వ శాఖల అవసరాల మేరకు ప్రభుత్వ అధికారుల నివాస గృహాలు నిర్మించేందుకు వినియోగించాలని సర్పంచ్ ప్రభుత్వాన్ని కోరారు.

సగరుల ఉనికి, హక్కుల కోసం పోరాటం

1986 సిఫార్సులను అమలు చేయాలి – నేర్లకంటి రవికుమార్ సగర

నల్లగొండ, నవంబర్ 16 (త్రినేత్ర ట్రూత్‌లైన్ ప్రతినిధి): సగర (ఉప్పర) కులాన్ని బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని నల్లగొండ జిల్లా సగర సంఘం అధ్యక్షుడు నేర్లకంటి రవికుమార్ సగర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట సగర సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. ఆధునిక యంత్రాల కారణంగా సంప్రదాయ వృత్తిని కోల్పోయిన సగరులు ఉపాధి కోసం హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం తదితర నగరాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణ రంగంలో కూలీలుగా పనిచేస్తూ దుర్భర జీవనం సాగిస్తున్నారని తెలిపారు. 1986లో ఎన్.కె. మురళీధర రావు కమిషన్ సగరులను బీసీ-ఏలో చేర్చాలని సిఫార్సు చేసిందని, అప్పటి ప్రభుత్వం జీఓ నంబర్ 166 ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తుచేశారు. నేటి పరిస్థితుల్లో సగరుల సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనాన్ని గుర్తించి బీసీ-ఏలో చేర్చాలని కోరారు.అలాగే సగర ఫెడరేషన్‌ను పూర్తిస్థాయి కార్పొరేషన్‌గా మార్చి బడ్జెట్ కేటాయించాలని, స్వయం ఉపాధి రుణాలు అందించాలని, ప్రభుత్వ కాంట్రాక్టు పనుల్లో సగర సొసైటీలకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. నిర్మాణ కార్మికులకు ఆరోగ్య భద్రత, రూ.10 లక్షల ప్రమాద బీమా, 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై భగీరథ మహర్షి విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ భవనం, హాస్టల్‌కు స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బలుగూరి కరుణాకర్ సగర, కోశాధికారి కోలుగూరి ప్రవీణ్ సగర, మహిళా అధ్యక్షురాలు నేర్లకంటి వసంత సగర, కంచర్ల అంజయ్య సగర, జిల్లా ఉపాధ్యక్షులు నేర్లకంటి సుధాకర్ సగర, ఉంగరాల వేమయ్య సగర, గంట వెంకన్న సగర, రాసాల వెంకన్న సగర, ఇతర సంఘం నాయకులు, మహిళలు, యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




విజయ్ బయోపిక్.. హీరోగా జేసన్ సంజయ్..!



విజయ్ జీవిత కథ ఆధారంగా బయోపిక్ తెరకెక్కనుందనే ప్రచారం తమిళ సినీ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ఇందులో విజయ్ తనయుడు జేసన్ సంజయ్ హీరోగా నటిస్తారని, రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం ధనుష్‌తో 'ఓం' సినిమా చేస్తున్న రాజ్‌కుమార్, విజయ్‌కు వీరాభిమాని కావడం ఈ ప్రచారానికి మరింత ఆసక్తి పెంచుతోంది. తమిళనాడు రాజకీయాల్లోనే కాకుండా సినిమా రంగంలోనూ ప్రస్తుతం విజయ్ పేరు మారుమోగుతోంది. ముఖ్యంగా విజయ్ సి. ఏం అయ్యి సినిమాలకి దూరమైన దగ్గర నుంచి, ఆయన అభిమానులు కొంచెం బాధలోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో విజయ్ జీవిత కథ ఆధారంగా బయోపిక్ తెరకెక్కబోతోందనే ప్రచారం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యి వాళ్ళకి ఆనందం తీసుకొస్తోంది. అంతేకాదు..ఈ సినిమాలో విజయ్ తనయుడు జేసన్ సంజయ్ హీరోగా నటించబోతున్నాడనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. విజయ్‌కు జేసన్ సంజయ్ కు ..ఎక్కువగా పోలికలు ఉంటాయి అన్న సంగతి తెలిసిందే. తండ్రి జీవితాన్ని తెరపై చూపిస్తూ, ఆయన పాత్రలో తనయుడే నటిస్తే ఇక ఆ సినిమాకి వచ్చే క్రేజ్ చెప్పనవసరం లేదు. ఇక అంతే కాకుండా ఈ సినిమాని, అమ్మరన్, ఓం సినిమా దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించనున్నారు అన్న వార్తల్లో కూడా గట్టిగా వినిపిస్తున్నాయి. అయితే ఈ బయోపిక్‌కు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మరోవైపు విజయ్‌పై దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామికి ఉన్న అభిమానం గురించి నటి సాయి పల్లవి ఈ మధ్యనే కొన్ని ఇంట్రెస్టింగ్ వ్యాఖ్యలు కూడా చేసింది. విజయ్ నటిస్తున్న జన నాయగన్ సినిమా ప్రమోషనల్ వీడియో చూసి రాజ్‌కుమార్ పెరియసామి చాలా ఎమోషనల్ అయ్యారని సాయి పల్లవి వెల్లడించారు. వన్ లాస్ట్ డ్యాన్స్ పేరుతో విడుదలైన ఆ వీడియో చూసినప్పుడు ఆయన కళ్లలో నీళ్లు తిరిగాయని ఆమె తెలిపారు. విజయ్‌కు వీరాభిమాని అయిన రాజ్‌కుమార్‌ను తాను అలా ఎప్పుడూ చూడలేదని సాయి పల్లవి చెప్పడం విశేషం. విజయ్ సినిమాల ప్రయాణాన్ని మాత్రమే కాకుండా ఆయన రాజకీయ ఎదుగుదలను కూడా రాజ్‌కుమార్ దగ్గరగా గమనించారు. ప్రస్తుతం రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఓం' సినిమాపై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. ధనుష్, సాయి పల్లవి, మమ్ముట్టి, శ్రీలీల, నాజర్ వంటి ప్రముఖ నటీనటులు ఈ చిత్రంలో భాగమయ్యారు. ఈ సినిమా నవంబర్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. మరి ఈ సినిమా తర్వాత ఈ దర్శకుడు విజయ్ బయోపిక్ ప్రకటిస్తారేమో వేచి చూడాలి.

సాయి పల్లవి ఇమేజ్ మారాల్సిన సమయం వచ్చిందా?

సున్నితమైన పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న సాయి పల్లవి ఇప్పుడు యాక్షన్ రోల్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ధనుష్ హీరోగా నటిస్తున్న 'ఓం -- చాప్టర్ 1: ఉధిరం'లో ఐపీఎస్ నిత్యారెడ్డి పాత్ర పోషిస్తున్నారు. పవర్‌ఫుల్ పోలీస్ అధికారిణిగా ఆమె నటన ఎలా ఉంటుందో, ఈ సినిమా ఆమెకు కొత్త గుర్తింపు తెస్తుందో చూడాలి. సహజమైన అందం, అభినయం, అద్భుతమైన డ్యాన్స్‌తో సౌత్ ఇండియాలో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ సాయి పల్లవి. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటూ.. తన నటనతోనే ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ నటి కెరీర్‌లో ఎన్నో విజయవంతమైన సినిమాలు ఉన్నాయి. అయితే ఇప్పుడు సాయి పల్లవి ముందు ఒక కొత్త ఛాలెంజ్.. కనిపిస్తోంది. ఇప్పటివరకు ఆమె సంపాదించుకున్న ఇమేజ్‌ను దాటి.. డిఫరెంట్ పాత్రలతో తనను తాను నిరూపించుకోవాల్సిన సమయం వచ్చినప్పుడు కనిపిస్తుంది తోంది. సాధారణంగా హీరోలు తమ కెరీర్‌లో వివిధ రకాల రోల్స్ చెయ్యగలిగితేనే.. స్టార్స్ గా ఎదుగుతారు. హీరోయిన్లు కూడా అన్ని రకాల పాత్రలు చేయగలరని నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో సాయి పల్లవికి మంచి నటిగా గుర్తింపు ఉన్నప్పటికీ, ఆమె ఎక్కువగా పక్కింటి అమ్మాయి తరహా పాత్రల్లోనే కనిపిస్తూ వచ్చారు. ఫిదా, లవ్ స్టోరీ, గార్గి, ప్రేమమ్ వంటి సినిమాల్లో ఆమె నటనకు మంచి ప్రశంసలు లభించాయి. ముఖ్యంగా డ్యాన్స్‌లో ఆమెకు మంచి క్రేజ్ ఉంది. అయితే యాక్షన్, పోలీస్ ఆఫీసర్, పవర్‌ఫుల్ పాత్రల్లో ఆమెను చూడాలని అభిమానులు కూడా కోరుకుంటున్నారు. మరోవైపు సీత పాత్రలో కనిపించిన రామాయణం సినిమా విషయంలో కూడా సాయి పల్లవిపై విమర్శలు వచ్చాయి. గతంలో అనుష్క అరుంధతి, భాగమతి వంటి సినిమాలు, కీర్తి సురేష్ కూడా మహానటి వంటి బయోపిక్ చేసిన తర్వాతే వాళ్ళు వేరే లెవెల్ హీరోయిన్ స్టేటస్ అందుకున్నారు. ఇలాంటి సినిమాలే వారిని విభిన్న పాత్రలు చేయగల హీరోయిన్లుగా నిలబెట్టాయి. ఇప్పుడు సాయి పల్లవి కూడా అలాంటి పేరు తెచ్చుకునే అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న ఓం -- చాప్టర్ 1: ఉధిరం సినిమాపై ఆసక్తి పెరుగుతోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో సాయి పల్లవి ఐపీఎస్ నిత్యారెడ్డి పాత్రలో కనిపించనున్నారు. సీబీఐలో అదనపు ఎస్పీగా పనిచేసే పవర్‌ఫుల్ పోలీస్ అధికారిణి పాత్రలో ఆమె కనిపించనుండటం విశేషం. ఇప్పటివరకు ఎక్కువగా సున్నితమైన పాత్రల్లో మెప్పించిన సాయి పల్లవి ఈసారి యాక్షన్.. పోలీస్ పాత్రలో ఎలా నటిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఈ పాత్రలోనూ ప్రేక్షకులను మెప్పిస్తే ఆమె కెరీర్‌కు మరో కొత్త గుర్తింపు తెచ్చుకునే అవకాశం ఉంది. మరి సాయి పల్లవి కూడా అనుష్క, కీర్తి సురేష్ లాగా అంతటి పేరు తెచ్చుకుంటుందేమో చూడాలి.



'ఆకాశంలో ఒక తార' ట్రైలర్: అమ్మాయి స్పేస్ డ్రీమ్ వెనుక దుల్కర్!

దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి ప్రధాన పాత్రల్లో పవన్ సాధినేని తెరకెక్కించిన 'ఆకాశంలో ఒక తార' ట్రైలర్ విడుదలైంది. ఆస్ట్రోనాట్ కావాలని కలలు కనే పల్లెటూరి అమ్మాయికి అండగా నిలిచే యువకుడిగా దుల్కర్ కనిపించారు. శ్రుతి హాసన్ స్పేస్ సైంటిస్ట్‌గా, రుహాని శర్మ కీలక పాత్రలో మెరిశారు. ఈ సినిమా నవంబర్ 20న నాలుగు భాషల్లో విడుదల కానుంది. తెలుగులో ఎప్పుడూ డిఫరెంట్ కథలను ఎంచుకునే దుల్కర్ సల్మాన్, మరోసారి ఒక ఫ్రెష్ కాన్సెప్ట్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. పవన్ సాధినేని దర్శకత్వంలో నటించిన లేటెస్ట్ మూవీ 'ఆకాశంలో ఒక తార'. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా సమర్పణలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మించిన ఈ సినిమా ట్రైలర్ రిలీజైంది. కమర్షియల్ హంగుల జోలికి వెళ్లకుండా, ఒక ఎమోషనల్ డ్రామాను తెరపైకి తెస్తున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. అబ్దుల్ కలాం కొటేషన్ తో మొదలైన ట్రైలర్, గోదావరి పల్లెటూరి బ్యాక్ డ్రాప్ లో సాగే ఒక సింపుల్ కథను పరిచయం చేసింది. ఇందులో కల్పన పాత్రలో సాత్విక వీరవల్లి కనిపిస్తున్నారు. ఇంగ్లీష్ కూడా సరిగ్గా రాని ఒక సాధారణ అమ్మాయి, ఆస్ట్రోనాట్ అయి స్పేస్ లోకి వెళ్లాలని పెద్ద కల కంటుంది. చుట్టుపక్కల వాళ్లంతా ఆమె ఆశను చూసి నవ్వుతున్నా, కృష్ణ పాత్రలో దుల్కర్ సల్మాన్ ఆమెకు సపోర్ట్ గా నిలుస్తారు. తన కల కోసం తానే కాలిలా మారి నడిపించాలనుకునే పల్లెటూరి కుర్రాడిగా దుల్కర్ లుక్, బాడీ లాంగ్వేజ్ నేచురల్ గా ఉన్నాయి.ట్రైలర్ లో డైలాగ్స్ కంటెంట్ కు తగ్గట్లు సింపుల్ గా, ఎమోషనల్ గా కుదిరాయి. "పది మంది నవ్వితే ఏంటి.. ఒక్కళ్లు నమ్మితే చాలదా కృష్ణ గారూ" అని హీరోయిన్ చెప్పే డైలాగ్ తో పాటు, చివర్లో కారులో దుల్కర్ ఎమోషనల్ అవుతూ "రేపు నువ్వు నన్ను వదిలి వేల కిలోమీటర్లు వెళ్తావ్.. అలవాటు చేసుకో" అని చెప్పే సీన్ టచ్ చేసేలా ఉంది. గ్రామీణ వాతావరణం నుంచి డీఆర్డీవో, ప్రైవేట్ స్పేస్ మిషన్ వరకు కథ మారే తీరును నీట్ గా కట్ చేశారు.ఈ ట్రైలర్ లో శ్రుతి హాసన్ రోల్ సర్ ప్రైజ్ ట్విస్ట్ లా కనిపిస్తోంది. రాకెట్ ప్రయోగాలు చేసే ఒక బోల్డ్ స్పేస్ సైంటిస్ట్ గా, సిగరెట్ తాగుతూ కాస్త రఫ్ యాటిట్యూడ్ ఉన్న 'రోహిణి' పాత్రలో శ్రుతి కొత్తగా కనిపించారు. కల్పన టాలెంట్ ను గుర్తించి తన టీమ్ లోకి తీసుకునే కీలక పాత్రలో ఆమె నటించారు. ఇక ట్రైలర్ ఎండింగ్ లో రుహాని శర్మ ఎంట్రీ ప్లెజెంట్ గా ఉంది. "ఆప్ దోనో కా కహానీ బహుత్ ప్యారా హై" అంటూ ఆమె చెప్పిన డైలాగ్ తో ట్రైలర్ ను కూల్ గా ముగించారు. టెక్నికల్ వర్క్ కూడా సినిమాకు బాగానే సెట్ అయినట్లు కనిపిస్తోంది. సుజిత్ సారంగ్ కెమెరా వర్క్ ఒకవైపు గోదావరి విలేజ్ విజువల్స్ ను, మరోవైపు స్పేస్ సెటప్ ను రిచ్ గా చూపించింది. జీవీ ప్రకాష్ కుమార్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సన్నివేశాల్లోని ఎమోషన్ ను బాగా క్యారీ చేసింది. గుణ్ణం గంగరాజు రైటింగ్, ప్రవీణ్ కెఎల్ ఎడిటింగ్ సినిమాకు ప్లస్ అయ్యేలా ఉన్నాయి. రొటీన్ ఫార్ములా సినిమాలకు భిన్నంగా ఒక ఇన్‌స్పైరింగ్ డ్రామాగా 'ఆకాశంలో ఒక తార' రూపొందినట్లు ట్రైలర్ క్లారిటీ ఇస్తోంది. ఎక్కడా ఓవర్ డ్రామా లేకుండా, కంటెంట్ మీద నమ్మకంతో తీసిన సినిమా లాగా అనిపిస్తోంది. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, హిందీ భాషల్లో నవంబర్ 20న ఈ మూవీ థియేటర్లలో రిలీజ్ కానుంది. మరి ఈ పల్లెటూరి అమ్మాయి స్పేస్ జర్నీ ఆడియన్స్ కు ఏ రేంజ్ లో కనెక్ట్ అవుతుందో చూడాలి.



వెంకటేష్ ఆ దర్శకులకు అవకాశం ఇచ్చేలా కనిపించడం లేదుగా?

వెంకటేష్ ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'జనవరి 12 విడుదల' సినిమా చేస్తున్నారు. గతంలో తరుణ్ భాస్కర్, తేజలతో సినిమాలు చేయాలనుకున్నా అవి పట్టాలెక్కలేదు. ప్రస్తుతం ఈ ఇద్దరు దర్శకులతో ప్రాజెక్టులు లేనట్టుగా తెలుస్తోంది. మరోవైపు గోపీచంద్ మలినేని చెప్పిన కథపై వెంకటేష్ కొన్ని మార్పులు సూచించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో విక్టరీ వెంకటేష్ కి ప్రత్యేకమైన స్థానం ఉంది. ఫ్యామిలీ సినిమాలను చేస్తూ ప్రేక్షకులను అలరించిన ఆయన, అడపదడపా యాక్షన్ సినిమాలను చేస్తూ మాస్ ఆడియన్స్ ని సైతం తన వైపు తిప్పుకున్నాడు. ప్రస్తుతం ఆయన డిఫరెంట్ సబ్జెక్టులు చేయకపోయిన ఫ్యామిలీ ఆడియన్స్ ని మెప్పించే సినిమాలను మాత్రమే చేస్తున్నాడు. రీసెంట్ గా 'ఆదర్శ కుటుంబం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆయన మరో సక్సెస్ ని తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రస్తుతం అనిల్ రావిపూడి డైరెక్షన్ లో 'జనవరి 12 విడుదల' మూవీ చేస్తున్నాడు. ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తుంది... ఆ ఇద్దరు దర్శకులను పక్కన పెట్టినట్టేనా? వెంకటేష్ ఒక దర్శకుడి పనితీరు నచ్చితే వాళ్లను ఇంటికి పిలిచి మన కాంబోలో మూవీ చేద్దాం స్టోరీ రెడీ చేసుకోమని చెబుతాడు. అలాంటి వెంకటేష్ 'పెళ్లి చూపులు' తర్వాత తరుణ్ భాస్కర్ తో సినిమా చేస్తానని చెప్పాడట. అలాగే 'నేను రాజు నేను మంత్రి' మూవీ తర్వాత తేజ డైరెక్షన్ లో మూవీ చేయడానికి సిద్ధమయ్యాడు. కానీ అనుకోని కారణాల వల్ల ఈ రెండు ప్రాజెక్టులు పట్టాలెక్కలేదు. దాంతో అటు వెంకటేష్ తన సినిమాల్లో బిజీగా ఉంటే ఇటు తరుణ్ భాస్కర్ నటుడిగా రాణిస్తూనే దర్శకుడిగా 'ఈనగారానికి ఏమైంది' మూవీ కి సీక్వెల్ చేస్తున్నాడు. ఇక తేజ ప్రస్తుతం ఖాళీగానే ఉన్నాడు. రానా తో రెండు సంవత్సరాల కిందట 'రాక్షస రాజా' అనే మూవీ స్టార్ట్ చేశాడు. కానీ అది మధ్యలోనే ఆగిపోయింది. దాంతో రానా తన తదుపరి ప్రాజెక్ట్స్ లో బిజీగా ఉండగా, తేజ మాత్రం కొత్త కథ రాసుకునే పనిలో ఉన్నాడు. మొత్తానికైతే వెంకటేష్ లైనప్ చూస్తే తరుణ్ భాస్కర్, తేజ లతో సినిమాలు చేసే అవకాశం లేనట్టుగా తెలుస్తుంది. వెంకటేష్ లైనప్ లో ఉన్న డైరెక్టర్స్ రీసెంట్ గా వెంకటేష్ కొంతమంది దర్శకులు చెప్పిన కథలను వింటున్నాడట. అందులో గోపీచంద్ మలినేని సైతం ఒక స్టోరీ చెప్పాడనే వార్తలు సినీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. వెంకటేష్ కి నచ్చినప్పటికి కొన్ని చేంజెస్ చెప్పాడట. ప్రస్తుతం బాలయ్య సినిమాతో బిజీగా ఉన్న గోపీచంద్ మలినేని వెంకటేష్ కథ మీద కూడా తన రైటర్స్ తో కూర్చున్నట్టుగా తెలుస్తోంది. వీళ్లిద్దరి కాంబోలో ఇప్పటికే బాడీగార్డ్ మూవీ వచ్చింది. అనుకున్న రిజల్ట్ ఇవ్వకపోయిన గోపీచంద్ డైరెక్షన్ కి ఇంప్రెస్ అయిన వెంకటేష్ తనతో మరో సినిమా చేయడానికి చాలా రోజుల నుంచి ప్రయత్నిస్తున్నాడు. కానీ వెంకటేష్ కి వేరే కమిట్ మెంట్స్ ఉండటం వల్ల అది వర్కౌట్ కాలేదు. ఇప్పుడు సాధ్యమవుతుందేమో చూడాలి...



'దాదా' టీజర్ పై క్రేజీ రూమర్ ?

బాలయ్య బాబు -- గోపీచంద్ మలినేని కలయికలో రాబోతున్న 'దాదా' సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా ప్రమోషన్స్ ఆల్ రెడీ మొదలయ్యాయి. ఐతే, ఈ సినిమా 2026 డిసెంబర్ 24న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాకి సంబంధించిన టీజర్ ను కట్ చేసినట్లు తెలుస్తోంది. టీజర్ లో బాలయ్య లుక్ చాలా కొత్తగా ఉంటుందని.. అలాగే, బాలయ్య ఎలివేషన్ ఎలిమెంట్స్ చాలా వైల్డ్ గా ఉంటాయని తెలుస్తోంది. ఇక టీజర్ ఎండింగ్ లో డైలాగ్ కూడా అదిరిపోతోందట. కొత్త సినిమా వార్తలు ఇక ఈ సినిమాలో కాజల్ అగర్వాల్, సముద్రఖని తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాలో మంచు మనోజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఐతే, బాలకృష్ణ -- దర్శకుడు గోపీచంద్ మలినేని కలయికలో వచ్చిన 'వీరసింహారెడ్డి' మంచి విజయం సాధించింది. ఆ సినిమా తర్వాత ఈ ఇద్దరూ కలిసి చేస్తున్న రెండో సినిమా ఇది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మొత్తానికి ఈ సినిమా కోసం బాలయ్య సరికొత్త మేకోవర్ లో కనిపించబోతున్నాడు.



Editor, Publiser & Owned by PERIKA ABHILASH, Address: 2-1-243/25/A, AMBEDKAR NAGAR, NALGONDA, TELANGANA-508001.
Printing: KOLANU PRINTERS H. NO: 6-2-1058, PLOT NO. 10, OLD VT COLONY, HYD ROAD, NALGONDA, TELANGANA-508001.